క్లుప్తంగా

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్ ఉచిత శిక్షణ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో శుక్రవారం నుంచి సీనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఏపీ ఈఏపీ సెట్ (ఎంసెట్) ఉచిత శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్, కరస్పాండెంట్ చెరువు రామకృష్ణ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాల కార్యాలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని వారు సూచించారు. ఇతర వివరాలకు 79936 99955, 83329 11155 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నేడు ధర్మజ్యోతి పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య కళా వేదికపై స్వధర్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ధర్మజ్యోతి 2023 పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కొరప్రాటి రామారావు, తూనుగుంట్ల సుందరరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సభలో గుమ్మడి రమేష్ చంద్ర 'ధర్మజ్యోతి 2023' పురస్కారాన్ని స్వీకరించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రామిరెడ్డినగర్‌కు చెందిన షేక్ షబియాకు క్రెడిట్ కార్డు ఉంది. ఈనెల 29న ఓ వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి కార్డు ఉపయోగిస్తున్నారా? అని అడిగాడు. ఉపయోగించడం లేదని చెప్పింది. దీనివల్ల అదనపు చార్జి పడుతోందని, అవి పడకుండా చేస్తానని చెప్పి నమ్మించాడు. దీంతో ఆమె ఓటీపీ చెప్పింది. అనంతరం షబియా అకౌంట్‌లోని రూ. 35వేలు విత్‌డ్రా అయ్యాయి. తాను మోసపోయానని గుర్తించిన బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీనుల విందుగా నవరత్న కీర్తనలు



పాత గుంటూరు: లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం వేదికగా శ్రీ భారతీ సంగీత నిలయం వ్యవస్థాపకురాలు ఏ. భారతీదేవి ఆధ్వర్యంలో అనఘా హైమా బృందం 108వ రామపునర్వసు, శ్రీరామనవమి సందర్భంగా శ్రీరామునిపై నవరత్న కీర్తనలను ఆలపించింది. సుమారు వంద మందికి పైగా గాయకులు వీనుల విందుగా ఆలపించి అలరించారు. తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వేంకట రంగనాయకి వ్యాఖ్యానం చేశారు. కార్యక్రమాన్ని సంఘం ప్రధాన కార్యదర్శి నేతి విశ్వేశ్వరరావు, వల్లూరి కిశోర్, గిరిజా శంకర్ పర్యవేక్షించారు.

స్వచ్ఛ మాషల్ మార్చ్



ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ కమిషనర్ హేమమాలిని

మంగళగిరి: నగరంలోని గౌతమబుద్ధా రోడ్డులో గురువారం నగరపాలక సంస్థ అధికారులు, ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు స్వచ్ఛ మాషల్ మార్చ్ నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ర్యాలీని అడిషనల్ కమిషనర్ హేమమాలిని జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నగర ప్రజలకు ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త వ్యర్థాలను వేరు చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ మార్చ్ నిర్వహించినట్లు వివరించారు. నగరంలోని గౌతమ బుద్ధా రోడ్డు మీదుగా సాగిన ర్యాలీ అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిబ్బంది మానవ హారం నిర్వహించారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, శానిటేషన్ సెక్రటరీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

నేడు కేఎల్‌యూలో బిజినెస్ స్కూల్ ఫెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో జాతీయస్థాయి మేనేజ్‌మెంట్ ఉత్సవాన్ని(బిజినెస్ ఫెస్ట్) 'ట్రాక్ష్యా' అనే అంశంతో నిర్వహించనున్నట్లు ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ కె.హేమ దివ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంగా ట్రాక్ష్యాను నిర్వహిస్తున్నామని, ఈ ఫెస్ట్‌కు ముఖ్య అతిథిగా టెక్ మహేంద్రా దక్షిణ భారత దేశ అధిపతి శ్రీనివాసరెడ్డి, గౌరవ అతిథిగా ఎంటర్‌పెన్యూర్ విజయరాఘవులు విచ్చేయనున్నారని వివరించారు. ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, ఇన్నోవేషన్ వంటి అంశాల్లో నైపుణ్యాలను, ప్రతిభను ప్రదర్శించడానికి విద్యార్థులకు ఇది అద్భుత అవకాశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

రమణీయం.. రాములోరి కల్యాణం

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- ఆలయాల్లో కనులపండువగా శ్రీ సీతారాముల కల్యాణం మహోత్సవం
- భక్తులతో కిక్కిరిసిన శ్రీరామ, ఆంజనేయస్వామి దేవాలయాలు



పాత గుంటూరు శ్రీ సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: నగరంలో శ్రీరామనవమి వేడుకల్ని వైభవంగా నిర్వహించారు. వాడవాడలా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే స్వామి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనడంతో ఆలయాలు కిక్కిరిశాయి. అర్చకులు కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, పానకం, వడపప్పు అందించారు.

- పాత గుంటూరులోని విశాఖ శ్రీ శారదా పీఠ పరిపాలిత శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో శ్రీ రామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాములోరి కల్యాణం తిలకించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.
- పార్క్ సెంటర్‌లోని కొత్తరాముల వారి గుడిలో కూరాకుల గురవయ్య ఆధ్వర్యంలో శ్రీ రామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారాములవారి కల్యాణం కనుల పండువగా చేశారు.
- శ్రీ సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి విశేష పూజల అనంతరం కన్నుల పండువగా కల్యాణాన్ని నిర్వహించారు. మండపంలో దంపతులు, భక్తులు పీటలపై ఆశీనులై కల్యాణం నిర్వహించారు.
- కొత్తపేటలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలోని మండపంలో శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి. శ్రీనివాసరావు పర్యవేక్షించారు.
- ఆర్. అగ్రహారంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని మండపంలో శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కన్నా లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.
- బ్రాడీపేట ఒకటో లైనులోని విశాఖ శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో శ్రీ రామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం ఆలయ మండపంలో శ్యాం సుందర్, ఆకాష్, రాంప్రసాద్, రవీంద్రబాబు దంపతులతో అర్చకులు విశ్వేశ్వరశర్మ శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రాములోరి కల్యాణం తిలకించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.
- స్తంభాలగరువులోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో అధ్యక్షుడు పి. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీ రామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం 57వ శ్రీ సీతారామచంద్రుల కల్యాణం కనుల పండువగా చేశారు. ఆలయ కార్యదర్శి చల్లా జగన్నాథరెడ్డి, కోశాధికారి ఉడుముల శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి భీమినేని రాంబాబు, సభ్యులు పర్యవేక్షించారు.
- కన్నావారితోటలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం హనుమత్ సమేత శ్రీ సీతారామ లక్ష్మణ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.
- కొరిటెపాడు గాంధీ బొమ్మసెంటర్‌లోని శ్రీ కోదండ రామాలయంలో మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు, అలంకార పూజ, అనంతరం శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత రమణీయంగా నిర్వహించారు. కార్యక్రమంలో నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, డెప్యూటీ మేయర్ షేక్ సజీల పాల్గొన్నారు. ఆలయ అధ్యక్షుడు కొమ్మినేని శివకోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కిలారి ఆదినారాయణ, కార్యదర్శి కొమ్మినేని ప్రసాద్, సభ్యులు కె. కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, పి. శ్రీనివాస్ పర్యవేక్షించారు.
- ఏటీ అగ్రహారం కంచికామకోటి పీఠ శ్రీ శంకర గాయత్రీ దత్తసాయి సత్యదేవమందిరంలో సీతారామ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అధ్యక్షుడు రాళ్లబండి వెంకట సత్యరామాంజనేయశర్మ పర్యవేక్షించారు.



స్తంభాల గరువు రామాలయంలో భక్తులు

ఎమ్మెల్యే ముస్తఫా ప్రత్యేక పూజలు



రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌత్రా సెంటర్‌లోని రామాలయం, పాత గుంటూరు తమ్మా రంగారెడ్డినగర్‌లోని నవమి పందిరిలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక కల్యాణార్థం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు జరుగుతాయన్నారు. ప్రజలందరికీ శ్రీరాముని ఆశీస్సులు నిండుగా, ప్రతి ఒక్కరి జీవితాల్లో మెండుగా వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రామాలయం చైర్మన్ గోవిందు రాజేష్, కార్పొరేటర్లు సంకూరి శ్రీను, మెహమూద్, వైఎస్సార్ సీపీ నేతలు కీసరి ఆదినారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్బులు, లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, రామిరెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



ఆర్. అగ్రహారంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కొత్తపేట శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారు



పార్క్ సెంటర్‌లోని కొత్త రాములవారి గుడిలో కల్యాణ మూర్తులు



బ్రాడీపేట శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కొరిటెపాడు కోదండరామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కన్నావారితోట శ్రీ కోదండ రామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



స్తంభాలగరువు శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



గోరంట్ల రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న మేయర్ కావటి, తులసి ధర్మచరణ్



ఏటీ అగ్రహారం దత్తసాయి మందిరంలో కల్యాణంలో పాల్గొన్న దంపతులు

గోరంట్ల రామాలయంలో...

కొరిటెపాడు: గోరంట్ల రామాలయంలో మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముందుగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల నుంచి ఆశీర్వచనాలు స్వీకరించి, శ్రీ సీతారామ కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కావటి మాట్లాడుతూ శ్రీ రాముడి సద్గుణాలు ప్రతి ఒక్కరికి సదా ఆదర్శమని తెలిపారు. తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ రామ నామం రక్షణ కవచమని, శ్రీ రామ మంత్రం అభయ హస్తం అని వెల్లడించారు. యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజలందరూ అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, తాళ్ల వెంకటేష్ యాదవ్, తాళ్ల నాగరాజు, కనకారావు, కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మ, యర్రంశెట్టి సూరి, గుడి సతీష్ కుమార్, గాజుల సాయిరాం, పలు రాజకీయ పార్టీ నాయకులు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వడ్డీ లేకుండా పన్నులు చెల్లింపులకు నేడే ఆఖరి రోజు

నెహ్రూనగర్: వడ్డీ లేకుండా ఆస్తి పన్నులు చెల్లింపులు చేసేందుకు శుక్రవారం ఆఖరు రోజు కావడంతో నగరపాలక సంస్థ అధికారులు క్యాష్ కౌంటర్ల సమయం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఉదయం 8గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, బృందావన్ గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయంలో పన్నులు చెల్లించవచ్చు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పాటు అదనంగా భారత్‌పేట 140వ వార్డు సచివాలయం, వసంతరాయపురం 148వ వార్డు సచివాలయం, పెద్ద పలకలూరు రోడ్డులోని 106వ వార్డు సచివాలయంలో కూడా పన్నులు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు.

నగరంలో 1,92,666 అసెస్‌మెంట్లు

నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 1,92,666 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటికి రూ.146.29 కోట్లు డిమాండ్ కాగా గురువారం సాయంత్రం రూ.114 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.32 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా దీనిలో అన్ కలెక్టబుల్ డిమాండ్ సుమారు రూ.20 కోట్లకు పైగా ఉంది. గత సంవత్సరం ఇదే మార్చి 31వ తేదిన ఒక్కరోజే రూ.4.30 కోట్లు వసూలు చేశారు. నేడు ఆఖరు రోజు కావడంతో సుమారు రూ.5 కోట్లు పైగా వసూలు అవుతుందని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు.

చైతన్య గోదావరి బ్యాంకు 247వ శాఖ ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న చైర్మన్ కామేశ్వరరావు, అధికారులు

నరసరావుపేట: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సత్తెనపల్లిరోడ్డు బరంపేట మూడు బావుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన 247వ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు నరసరావుపేట రూరల్ బ్రాంచ్‌ను గురువారం ఆ బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ బ్యాంక్ శాఖ సేవలను నరసరావుపేట పరిసర ప్రాంతాల్లోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులు, బడుగు, బలహీన వర్గాలకు చేయూతనిస్తూ గ్రామీణ బ్యాంకుల్లో ప్రప్రథమంగా నిలుస్తోందని పేర్కొన్నారు. విద్య, తనఖా, భూమి కొనుగోలు వంటి అన్నిరకాల రుణాలు, అన్ని సదుపాయాలను కల్పిస్తుందన్నారు.

'ఆర్‌వీఆర్'లో హనీవెల్ మైక్రోసాఫ్ట్ శిక్షణ కార్యక్రమం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నైపుణ్యంతో కూడిన విద్యను అందించి వారికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు ఆయా కోర్సుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకునే విధంగా ఈ శిక్షణను అందిపుచ్చుకోవాలన్నారు. అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీ హనీవెల్ సహకారంతో ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్‌పై 100 గంటల సర్టిఫికేషన్ కోర్సు ట్రెనింగ్ ప్రోగ్రాంను ప్రారంభించటం సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కోర్సులో చేరిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంపీపీ చంద్రశేఖర్, శేషగిరి, సత్తిబాబు, మల్లిఖార్జునరావు, ప్రశాంత్ తదితరులున్నారు.

కేఎల్‌యూ విద్యార్థుల ఫ్లాష్‌మాబ్





ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: భావ, భాష వ్యక్తీకరణ చేయడం ద్వారా విద్యార్థుల్లో దాగిఉన్న నాయకత్వ లక్షణాలు వెలికి తీయవచ్చని కేఎల్ విశ్వవిద్యాలయ బీఏ ఐఏఎస్ విభాగ అధిపతి డాక్టర్ వెంకటేశ్వర కుమార్ చెప్పారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో గురువారం ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర కుమార్ మాట్లాడుతూ శుక్రవారం జరగబోయే జాతీయస్థాయి సాంస్కృతిక యువజనోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు ఫ్లాష్ మ్యాబ్‌ను నిర్వహించారని చెప్పారు. అనంతరం ఆటపాటలు, నృత్యాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా విజయవాడకు వెళ్లి ట్రెండ్‌సెట్ మాల్‌లో ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిశోర్‌బాబు, బీఏ ఐఏఎస్ విభాగ డెప్యూటీ అధిపతి డాక్టర్ అనిల్, డాక్టర్ ఆర్. సాయి కుమార్ విద్యార్థులను అభినందించారు.

టీకాతో పశు రక్ష

- వాతావరణ మార్పుల కారణంగా వ్యాధుల బారిన పశువులు
- గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం
- సకాలంలో వైద్యం అందకపోతే మృత్యువాతపడే ప్రమాదం
- 4 నెలలు దూడలకు కూడా టీకాలు వేయించాలంటున్న పశువైద్యులు
- ముమ్మరంగా కొనసాగుతున్న వ్యాక్సినేషన్



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి సాయి సతీష్

కొల్లిపర: పశువులకు టీకాలు వేయటం వాటికి శ్రీరామరక్ష అని పశువైద్యులు చెబుతున్నారు. వాతవరణంలో మార్పులు మొదలవగానే పశువులు ముఖ్యంగా గాలికుంటు వ్యాధి బారినపడే అవకాశం ఉందని వైద్యులు ముఖ్యంగా చెబుతున్నారు. ఈ వ్యాధికి సకాలంలో వ్యాక్సిన్ వేస్తేనే పశువులకు రక్షణ కలుగుతుంది. సకాలంలో వైద్యం అందకపోతే మృతిచెందే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవాలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఉచిత టీకాల కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుతం 31వ విడత మార్చి 29 నుంచి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని పశువైద్యశాలల ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ ప్రారంభించారు.

పశువులకు టీకాలు.....

మండలంలోని పశువైద్యాధికారులు పశుపోషకుల వద్దకు స్వయంగా వెళ్లి పశువులకు టీకాలు వేస్తున్నారు. కొల్లిపర మండలంలో గెదేలు 11,466 ఉండగా , ఆవులు 354 ఉన్నాయి. తొలిరోజు మండలంలో దావులూరిపాలెం గ్రామంలో కొల్లిపర మండల పశువైద్యాధికారి డాక్టరు సాయిసతీష్‌రాజు, తూములూరు జూనియర్ డాక్టర్ షేక్‌సుబాని సాహెబ్‌లు 100 పశువులకు టీకాలు వేశారు. ఏప్రిల్ 30వ తేదీవరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని పశువైద్యాధికారులు తెలిపారు.

గాలికుంట వ్యాధి లక్షణాలు ...

పశువులకు గాలికుంటు వ్యాధి సోకిన వెంటనే జ్వరం వస్తుంది. నాలుక, చిగుళ్లు, కాలి గిట్టల మధ్య పుండ్లు ఏర్పడుతాయి. మేత తినవు, ఎక్కువ సేపు నిల్చోలేవు, ఎక్కువ దూరం నడవలేవు, నోటి వెంట నురగ కక్కుతూ ఉంటాయి.

నివారణ ఇలా...

వ్యాధి సోకిన వెంటనే పశువులను గుర్తించి తోటి పశువుల నుంచి వేరుచేసి కొద్దిగా దూరంగా కట్టేయాలి. ఇలా చేయపోతే ఇతర పశువులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వెంటనే పశువైద్యుడిని సంప్రదించి వైద్యం చేయించాలి. వ్యాధి సోకక ముందు ఎఫ్ఎండీ వ్యాక్సిన్ వేయించాలి. సోకిన తరువాత పెన్సిలిన్, యాంటీ ఇస్లమిన్, యాంటీ ఇన్లమేటరీ డ్రగ్స్ వాడుతూ నోటిలో, గాలి గిట్ట మధ్య గ్లిజనికత్‌తో శుభ్రం చేసి బోరిక్ పౌడర్ పట్టించాలి.

వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి....

పశువులకు గాలికుంటు వ్యాధి సోకక ముందే ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాక్సిన్ వేయించాలి. 4 నెలల దూడలకు కూడా టీకాలు వేయించాలి. పాలు ఇచ్చే గేదెలకు టీకాలు వేస్తే పాలు తగ్గుతాయి అన్న అపోహలు వీడి ప్రతి గేదెకు టీకాలు వేయించాలి. వ్యాధి వచ్చినట్లు గుర్తిస్తే వెంటనే ఆ గ్రామంలోని పశువైద్యులను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. వ్యాధి వచ్చిన తరువాత కంటే రాక ముందు వ్యాక్సిన్ వేయిస్తే మంచిది.

– డాక్టర్ సాయి సతీష్‌రాజు, కొల్లిపర మండల పశువైద్యాధికారి

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



సత్తెనపల్లి: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన గోరంట్ల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన మద్దిగుంట్ల రామారావు వ్యవసాయ పనుల నిమిత్తం రూ.1.50 లక్షలతో జత ఎడ్లను 20 రోజుల క్రితం కొనుగోలు చేశాడు. పొలంలో మేతకు వెళ్లి తిరిగి వస్తుండగా గారపాడు రోడ్డులోని పొలంలో రెండున్నర అడుగుల ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆకుల మేసేందుకు వెళ్లిన ఎద్దు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఎద్దు వెళుతుండగా యజమాని దానిని పక్కకు అదిలించాడు. ప్రమాదకరంగా ఎత్తు తక్కువగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలను మార్చక పోవడంతో ఎద్దు మృతి చెందిందని, ఇది విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యవల్లే జరిగిందని రైతు రామారావు ఆందోళన వ్యక్తం చేశాడు.